

సాక్షి అనకాపల్లి
శుక్రవారం । 8 । మార్చి । 2024

జన హర్షం పూల వర్షం



అనకాపల్లి మండలం పిసినికాడ సభలో పాల్గొన్న జన సందోహం.. ప్రజలకు అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

- అట్టహాసంగా చేయూత నాలుగో విడత నిధుల పంపిణీ
- ప్రియతమ సీఎంను చూసేందుకు బారులు తీరిన ప్రజలు
- జై జగన్.. వన్స్‌మోర్ సీఎం.. నినాదాలతో హోరెత్తిన అనకాపల్లి
- ముఖ్యమంత్రి దృష్టికి అనకాపల్లి సమస్యలు తీసుకెళ్లిన మంత్రి అమర్‌నాథ్
- రూ.21 కోట్లతో వాటిని పరిష్కరిస్తానని సీఎం వైఎస్ జగన్ హామీ

సాక్షి, అనకాపల్లి:

అభిమానం.. ఆత్మీయత అంటే ఇలా ఉంటుందన్న రీతిలో సాగిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగం.. అందుకు ప్రతిస్పందనగా ప్రజల నుంచి వ్యక్తమైన హర్షాతిరేకంతో అనకాపల్లి మండలం పిసినికాడ ఓ అపూర్వమైన సందర్భానికి వేదికగా నిలిచింది. సీఎం మాట్లాడుతున్నంతసేపూ జనం కరతాళధ్వనులతో ఆప్యాయత వ్యక్తం చేస్తూనే ఉన్నారు. ఐదేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో జరిగిన సంక్షేమాన్ని, అభివృద్ధిని ప్రజలకు సీఎం వైఎస్ జగన్ వివరించారు. 99 శాతం హామీలు అమలు చేయడమే కాకుండా మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేవిధంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, వాటితో లబ్ధి పొందిన పేద ప్రజల గురించి తెలిపారు. గత టీడీపీ–జనసేన ఉమ్మడి ప్రభుత్వంలో చంద్రబాబు ఇచ్చిన అబద్ధపు హామీలు నెరవేర్చకుండా ప్రజలను ఎలా మోసం చేశారో విపులీకరించారు. గత టీడీపీ ప్రభుత్వంలో అనుభవించిన కష్టాలు, వైఎస్సార్‌సీపీ 58 నెలల పాలనలో జరిగిన సంక్షేమం, అభివృద్ధిని బేరీజు వేసుకోవాలని పిలుపునిచ్చారు. దీంతో వన్స్‌మోర్ సీఎం.. జై జగన్.. అని నినాదాలు చేస్తూ ప్రజలు పెద్ద ఎత్తున మద్దతు పలికారు. మహిళాభ్యున్నతికి చేపడుతున్న పథకాలను సీఎం వివరిస్తుండగా అక్క చెల్లెమ్మలు థాంక్యూ సీఎం సర్ అంటూ ప్లకార్డులు ప్రదర్శించి అభిమానాన్ని చాటుకున్నారు. సభా ప్రాంగణం మొత్తం జనంతో నిండిపోగా.. సభావేదిక వెలుపల వేలాది మంది నిల్చొని అభిమాన నేత ప్రసంగాన్ని ఆసక్తిగా ఆలకించడం కనిపించింది.



సీఎం వాహనంపై పూల వర్షం కురిపిస్తున్న మహిళలు

ప్రభం'జనం'.. వెల్లువెత్తిన అభిమానం.. ఉప్పొంగిన ఉత్సాహం.. సంక్షేమ సారథిపై అడుగడుగునా పూల వర్షం.. పేదల అభ్యున్నతికి అహర్నిశలు శ్రమిస్తున్న జననేతకు జన నీరాజనం.. నూతన జిల్లాగా ఏర్పడిన తరువాత మొదటిసారి అనకాపల్లి నియోజకవర్గానికి విచ్చేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు. ప్రియతమ సీఎం ప్రసంగానికి కరతాళధ్వనులతో హర్షం వెలిబుచ్చారు. ముఖ్యమంత్రిని చూసిన ఆనందంలో అక్కచెల్లెమ్మల సందడి అనకాపల్లి మండలం పిసినికాడలో గురువారం జాతరను తలపించింది. మహాశివరాత్రి పర్వదినం ముందే వచ్చిందా అన్నట్లు జాతీయ రహదారి అంతా పండగ వాతావరణం కనిపించింది. ఓ పెద్ద కొడుకు.. ఓ పెద్దన్న వచ్చినంత ఆనందంగా ఉందని మహిళలు ఉప్పొంగిపోయారు. హెలిప్యాడ్ నుంచి సభా ప్రాంగణం వరకు అభిమాన నేతకు బ్రహ్మరథం పట్టారు. ఈ ఐదేళ్లలో పొందిన లబ్ధికి కృతజ్ఞతగా 'థాంక్యూ సీఎం సర్' అంటూ ప్లకార్డులు పట్టుకుని హర్షం వ్యక్తం చేశారు.



బటన్ నొక్కి చేయూత నిధులు విడుదల చేస్తున్న సీఎం జగన్



సీఎం జగన్‌తోపాటు వేదికపై డిప్యూటీ సీఎంలు రాజన్నదొర, ముత్యాలనాయుడు, మంత్రులు బొత్స సత్యనారాయణ, అమర్‌నాథ్, పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, ప్రభుత్వ విప్ ధర్మశ్రీ, ఎంపీలు సత్యవతి, మాధవి, ఎమ్మెల్యేలు గణేష్, రెడ్డి శాంతి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

సభ జరిగిందిలా..

విశాఖ నుంచి హెలికాప్టర్‌లో కశింకోట వచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. రోడ్డు మార్గంలో అనకాపల్లి మండలం పిసినికాడ సభావేదిక వద్దకు ఉదయం 11.10 గంటలకు చేరుకున్నారు. వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం వైఎస్సార్ చేయూత నాలుగో విడత పంపిణీ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. తొలుత కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి జిల్లాలో వైఎస్సార్ చేయూత లబ్ధిదారుల వివరాలతోపాటు వైఎస్సార్ సీపీ ప్రభుత్వ 58 నెలల పాలనలో నవరత్నాల పేరిట లబ్ధి పొందిన వారి గురించి వివరించారు. అనంతరం జిల్లాలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం గురించి వివరించారు. అనంతరం అనకాపల్లి ఎమ్మెల్యే, మంత్రి గుడివాడ అమర్‌నాథ్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మలసాల భరత్‌కుమార్ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం గురించి వివరించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నియోజకవర్గంలో పేదలకు జరిగిన మేలు వివరించారు. అనంతరం జిల్లాలో లబ్ధి పొందిన ఇద్దరు మహిళలు తమకు అందిన ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వాటితో ఏ విధంగా లాభం పొందారో వివరించారు. పాయకరావుపేట నియోజకవర్గం కోటవురట్ల మండలం రామచంద్రపాలేనికి చెందిన రమణమ్మ, చీడికాడ మండలం గండివరం గ్రామానికి చెందిన సుంకర వెంకటలక్ష్మి సీఎం సమక్షంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పొందిన లబ్ధి, సంక్షేమం గురించి వివరించారు. అనంతరం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి లబ్ధిదారులందరి తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగించారు. బటన్ నొక్కి వైఎస్సార్ చేయూత నాలుగో విడత నిధుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మహిళామార్ట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మహిళలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు సత్యవతి, గొడ్డేటి మాధవి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఎమ్మెల్యేలు గొల్ల బాబూరావు, కంబాల జోగులు, యూవీ రమణ మూర్తిరాజు (కన్నబాబురాజు), పెట్ల ఉమాశంకర్ గణేష్, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, కె.భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణ, ఉమ్మడి విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొండా రాజీవ్ గాంధీ, మాజీ డీసీసీబీ చైర్మన్ సుకుమార్ వర్మ, యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, ఏపీడబ్ల్యూఐఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, మహిళా కమిషన్ సభ్యులు గెడ్డం ఉమా, జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ భీశెట్టి వరాహ సత్యవతి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, జిల్లా మహిళా అధ్యక్షురాలు ఈర్లె అనురాధ, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి పలకా రవి, జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో అనకాపల్లి : కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ చేయూత కింద జిల్లాలో లక్షా 16 వేల మంది లబ్ధి పొందారని కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి తెలిపారు. వీరికి రూ.582.91 కోట్లు చెల్లించామన్నారు. నాలుగో విడతలో రూ.218.31 కోట్లు మంజూరైనట్టు వివరించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచనలతో జిల్లా మంత్రులు, ప్రజాప్రతినిధుల సహకారంతో అనకాపల్లి జిల్లా అన్ని రంగాల్లో ముందుకు సాగుతోందన్నారు.

దేశానికే ఆదర్శవంతమైన పాలన

వైఎస్సార్‌సీపీ అనకాపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జిగా అవకాశం కల్పించి పెద్ద బాధ్యత అప్పగించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎప్పటికీ రుణపడి ఉంటానని మలసాల భరత్‌కుమార్ అన్నారు. దేశ విదేశాలు తిరిగాను.. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా ఏపీలో సంక్షేమం, అభివృద్ధి చేశారన్నారు. వైఎస్సార్‌సీపీ 58 నెలల పాలనలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి యావత్ దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. మరో 30 రోజుల్లో జరిగే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మరోమారు ఓటు వేసి సీఎంగా జగన్‌ను గెలిపించుకోవడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. అందులో తమ నియోజకవర్గ ప్రజలు మరింత ఉత్సాహంగా ఉన్నారన్నారు.

నా తలరాతను రాసేది జగనన్నే



బడుగు వర్గాల అక్కచెల్లెమ్మలకు 'చేయూత'ను అందించడానికి ఈ పథకం పెట్టారు. అన్న మాట ప్రకారం నాలుగో విడత నిధులు విడుదల చేస్తున్నారు. ఒక్క అనకాపల్లి నియోజకవర్గంలోనే సంక్షేమం కోసం రూ.1,500 కోట్లు ఖర్చు పెట్టిన ఒకే ఒక్కడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. మరో నెలలో ఎన్నికలు జరగనున్నాయి. ఆయనను ఎదుర్కోవడానికి అందరూ కలిసికట్టుగా వస్తున్నారు. ఎంతమంది వచ్చినా.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భయపడేదే లేదు. ఆయనను ఎదుర్కోవాలంటే ఎదురుగా కూడా జగన్‌మోహన్‌రెడ్డే కావాలి. నువ్వెక్కడ నుంచి పోటీ చేయబోతున్నావని చాలామంది నన్ను అడుగుతున్నారు. నేను చాలా సందర్భాల్లో చెప్పాను. మరోసారి చెప్తున్నా.. నన్ను ఉమ్మడి విశాఖ జిల్లాకు డిప్యూటీ రీజనల్ కోఆర్డినేటర్‌గా నియమించారు. ఉమ్మడి విశాఖలో ఉన్న 15 అసెంబ్లీ సీట్లలో పార్టీ గెలుపొందడమే నా లక్ష్యం. జగనన్న మళ్లీ సీఎం కావడమే నా ధ్యేయం. అందరి తలరాతలు భగవంతుడు రాస్తాడు. గుడివాడ అమర్‌నాథ్ తలరాత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాస్తారు.

–మంత్రి అమర్‌నాథ్



ముఖ్యమంత్రికి మహిళల అభివాదం

అనకాపల్లికి సీఎం వరాల జల్లు..

అనకాపల్లి నియోజకవర్గానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు వరాలు కురిపించారు. వైఎస్సార్ చేయూత నాలుగో విడత పంపిణీ కార్యక్రమంలో సభా వేదిక సాక్షిగా రూ.21 కోట్లతో తలపెట్టే పలు అభివృద్ధి పనులు పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. తొలుత వీటిని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సీఎం దృష్టికి తీసుకెళ్లగా పైవిధంగా స్పందించారు. వాటిలో...

- రూ.5 కోట్లతో అనకాపల్లి వ్యవసాయ మార్కెట్‌లో నూతన కోల్డ్ స్టోరేజ్ నిర్మాణం, మార్కెట్ యార్డ్‌లో షాపింగ్ కాంప్లెక్స్‌లు, కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటు
- రూ.3 కోట్లతో కశింకోటలో శారదానదిపై అసంపూర్తిగా ఉన్నటువంటి బ్రిడ్జి నిర్మాణం
- రూ.3 కోట్లతో రేబాక నుంచి కొప్పాక వరకూ డబుల్ రోడ్డు నిర్మాణం
- రూ.4 కోట్లతో గవరపాలెం నుంచి తుమ్మపాల, తుమ్మపాల నుంచి బొజ్జనకొండ వరకూ వెళ్లే రోడ్డు నిర్మాణం
- కశింకోటలో జగనన్న కాలనీ నిర్మించారు. శారదా నది ఒడ్డున ఈ కాలనీ చుట్టూ రూ.6 కోట్లతో రిటర్నింగ్ వాల్ నిర్మాణం



సీఎం జగన్‌ను చూసి చిన్నారుల కేరింతలు



మహిళామార్ట్‌లో ప్రతిభ చూపిన వారికి అవార్డు ప్రదానం



ప్లకార్డులతో మహిళల కోలాహలం

పింఛనే జీవనాధారం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటిసారిగా వితంతు పింఛన్ వచ్చింది. నాలుగేళ్లగా పింఛన్ పొందుతున్నాను. ఇప్పుడు రూ.3 వేల వంతున నెలకు వస్తోంది. కూలీగా పని చేస్తున్న మా కుటుంబ జీవనానికి చేదోడుగా ఉపయోగపడుతోంది. ఎంతో ఆనందంగా ఉంది.

– యడ్ల రాజులమ్మ, తోటకూరపాలెం, రావికమతం

దూరమైనా సీఎం సభకు వచ్చా



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గతంలో ఎన్నడూ లేని విధంగా సంక్షేమ పాలన అందిస్తూ అన్ని కుటుంబాలను ఆదుకుంటున్నారు. ఆయనపై అభిమానంతో దూరం అయినా బహిరంగ సభకు హాజరయ్యాం. ఆయన ప్రసంగం ఎంతో ఆకట్టుకుంది.

–వల్లి నాగరత్నం, పాయకరావుపేట

'పాయకరావుపేట' పరిశీలకురాలిగా వరుదు కల్యాణి



సాక్షి, అనకాపల్లి: వైఎస్సార్ సీపీ పాయకరావుపేట నియోజకవర్గ పరిశీలకురాలిగా ఎమ్మెల్సీ వరుదు కల్యాణి నియామకమయ్యారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గురువారం పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.

వలంటీర్లపై అయ్యన్న కపట ప్రేమ

- ఓటమి భయంతో వారిని తొలగించబోమని ప్రకటన

నాతవరం: ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిలా పనిచేస్తున్న వలంటీర్ వ్యవస్థపై నాడు నోరు పారేసుకున్న టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడుకు ఇప్పుడు ఉన్నపళంగా వారిపై మమకారం పుట్టుకొచ్చింది. అనకాపల్లి జిల్లా నాతవరం మండలం పెదగొలుగొండపేట, గునిపూడి గ్రామాల్లో గురువారం రాత్రి ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడారు. వలంటీర్లను విధుల నుంచి తొలగించబోమని మాట మార్చారు. వారిని టచ్ చేస్తే మనుగడ ఉండదన్న విషయాన్ని గ్రహించి వరాల జల్లు కురుపిస్తున్నారు. పార్టీ అధినాయకుడు చంద్రబాబు వలంటీర్లకు ఎలాంటి వరాలు ఇవ్వకపోయినప్పటికీ అయ్యన్నపాత్రుడు మాత్రం వచ్చే ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు వారిని పొగడ్తలతో ఆకాశానికి ఎత్తేస్తున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చినప్పుడు అనేక ఆరోపణలు చేసిన ఆయన టీడీపీ అధికారంలోకి రాగానే వలంటర్లను తీసిపారేస్తామని, వారిని వదిలిపెట్టేది లేదని బహిరంగంగానే బెదిరింపులకు దిగారు. ఇప్పుడు ఓటమి భయంతో ప్రశంసలు కురిపిస్తూ నివ్వెరపరుస్తున్నారు.

సీఎం ఆదేశం.. క్షణాల్లో సాయం

- దీర్ఘకాలిక రోగులకు సీఎం సహాయనిధి నుంచి ఆర్థిక సాయం

సాక్షి, అనకాపల్లి: దీర్ఘకాలిక రోగుల పరిస్థితికి చలించిపోయిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించిన క్షణాల్లోనే వారికి సీఎం సహాయ నిధి సాయం అందింది. పిసినికాడ బహిరంగ సభకు విచ్చేసిన ఆయన తిరుగు పయనంలో కశింకోట హెలిప్యాడ్ వద్ద రాగా, 17 మంది దీర్ఘకాలిక రోగులు తమ దీన స్థితిని విన్నవించుకున్నారు. వీరికి తక్షణమే సహాయం అందించాలని కలెక్టర్ రవిపట్టన్‌శెట్టిని ఆదేశించారు. దాంతో ఆరు గంటల వ్యవధిలోనే ఒక్కొక్కరి వ్యాధి పరిస్థితి ఆధారంగా రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకూ అందజేశారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో రూ.22 లక్షల మేర చెక్కులు బాధితులకు పంపిణీ చేశారు.

సీఎం సహాయనిధి పొందిన వారి వివరాలు....

పెంటకోట యశ్వంత్ వెంకట గణేష్‌నాయుడు (మునగపాక), పెంటకోట వెంకట సూర్య (అనకాపల్లి టౌన్), మళ్ల సాయికిరణ్ (అనకాపల్లి మండలం పిసినికాడ), జోయా మహమ్మద్ (విశాఖ), రాయుడు తరుణ ఏసుదుర్గ కుమార్ (పాయకరావుపేట మండలం రత్నాయంపేట), బలిజ పూర్ణేష్ (రోలుగుంట మండలం బలిజపాలెం), రేబాక గాయిత్రీ (మునగపాక మండలం వెంకటాపురం), మైలపల్లి సోమేష్ (ఎస్.రాయవరం మండలానికి చెందిన బంగారయ్యపాలెం), ముదిల చైతన్యుడు (విజయనగరం ఎస్సీ కాలనీ), బర్నాల తాస్విక్ (విజయనగరం జిల్లా గరివిడి), పారుపల్లి మహేష్ (రావికమతం మండలం గొంపవానిపాలెం), కాండ్రేగుల చరణ్ (యలమంచిలి), రేబాక రాము (రాంబిల్లి మండలం కొత్తూరు), పినపాత్రుని గంగలక్ష్మి (ఎస్.రాయవరం మండలం గెడ్డపాలెం), కుబీరా శ్రీనివాసరావు (తాడేపల్లిగూడెం), గుడే నీలిమ (గుంటూరు), పావాడ బాలాజీ (కశింకోట).





ఎస్.రాయవరం మండలానికి చెందిన పినపాత్రుని గంగలక్ష్మి సమస్యను తెలుసుకుంటున్న సీఎం జగన్ (పక్కన) గంగలక్ష్మికి చెక్కు అందజేస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

నువ్వు గింజలతో శివుడికి హారం



రవికుమార్ తయారు చేసిన హారం

మాకవరపాలెం: మండలంలోని తూటిపాలకు చెందిన మైక్రో రైటర్ రవికుమార్ నువ్వు గింజలతో శివుడికి హారం తయారు చేశాడు. శుక్రవారం మహాశివరాత్రి సందర్భంగా 1614 నువ్వు గింజలతో హారం రూపొందించి మధ్యలో సూక్ష్మ లిపిలో లింగాష్టకం, బిల్వాష్టకం రాశాడు.

క్లుప్తంగా

ప్రశాంత వాతావరణంలో ఇంటర్ పరీక్షలు

అనకాపల్లి : ప్రశాంత వాతావరణంలో ఇంటర్ పరీక్షలు జరుగుతున్నాయని ఇంటర్మీడియట్ జిల్లా అధికారి కె.సుజాత చెప్పారు. గురువారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం గణితం–2, బోటనీ –2, సివిక్స్–2 పరీక్షలకు 10,859 మందికి జనరల్ విద్యార్థులకుగాను 10,538 మంది పరీక్షలు రాయగా, 321 మంది గైర్హాజరయ్యారని, 2,342 మంది ఒకేషనల్ విద్యార్థులకుగాను 2,264 మంది పరీక్ష రాయగా, 78మంది గైర్హాజరయ్యారన్నారు.

మహిళలకు చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న సివిల్ జడ్జి అరుణశ్రీ

చోడవరం రూరల్: చట్టాలపై మహిళలకు అవగాహన అవసరమని చోడవరం సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవా ప్రాధికార సంస్థ చైర్పర్సన్ సత్తి అరుణశ్రీ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం స్థానిక కో ఆపరేటివ్ కాలనీలోని వికాస మహిళా పొదుపు సంఘంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల హక్కుల రక్షణకు కల్పించిన ప్రత్యేక చట్టాల గురించి తెలుసుకున్నప్పుడే తమ పట్ల సమాజం చూపుతున్న వివక్షను గ్రహించి, ఎదుర్కొగలిగే ధైర్యం వస్తుందన్నారు. మహిళలకు న్యాయ సేవా సంస్థ అందిస్తున్న ఉచిత న్యాయ సహాయాన్ని పొందే వీలుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వికాస మహిళా పరస్పర సహాయక సంఘం ఎండీ కె.సరోజ, తదితరులు పాల్గొన్నారు.



కశింకోటలో హెలిప్యాడ్ వద్ద సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మొక్కను అందజేస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి



ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీఐజీ విశాల గున్నీ



సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి సతీసమేతంగా స్వాగతం పలికిన ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, వారి కుటుంబ సభ్యులు

సీఎం జగన్‌కు ఘన స్వాగతం.. వీడ్కోలు

గోపాలపట్నం (విశాఖ): అనకాపల్లి జిల్లా పర్యటనలో భాగంగా విశాఖ వచ్చిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డికి విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. ఆయన గురువారం ఉదయం 9.32 గంటలకు గన్నవరం నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి 10.07 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకున్నారు. మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు, వీఎంఆర్డీఏ చైర్మన్ ఎస్.చంద్రమౌళి, నగర పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్, జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ తదితరులు సీఎం జగన్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. ఇక్కడి నుంచి 10.18 గంటలకు ఆయన హెలికాప్టర్‌లో అనకాపల్లి బయలుదేరారు. ఆయన వెంట రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఉన్నా రు. అక్కడ పర్యటన ముగించుకుని మధ్యాహ్నం 2.40 గంటలకు సీఎం జగన్ విశాఖ విమానాశ్రయానికి చేరుకున్నారు. ప్రత్యేక విమానంలో 2.50 గంటలకు గన్నవరం బయలుదేరారు.

హెలిప్యాడ్ వద్ద సాదర స్వాగతం

సాక్షి, అనకాపల్లి : వైఎస్సార్ చేయూత నాలుగో విడత పంపిణీ కార్యక్రమానికి అనకాపల్లి విచ్చేసిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి గురువారం ఘన స్వాగతం పలికారు. కశింకోట ఎంపీడీవో కార్యాలయ సమీపంలో గల హెలిప్యాడ్ వద్ద డిప్యూటీ సీఎంలు పీడిక రాజన్నదొర, బూడి ముత్యాలనాయుడు, మంత్రి గుడివాడ అమర్‌నాథ్, వైఎస్సార్‌సీపీ అనకాపల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మలసాల భరత్‌కుమార్, ఎంపీ బి.వి.సత్యవతి, జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, జిల్లా కలెక్టర్ రవి పట్టాన్ శెట్టి, జేసీ జాహ్నవి, డీఐజీ విశాల గున్నీ, జిల్లా ఎస్పీ మురళీకృష్ణ స్వాగతం పలికారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు కుటుంబం సాదర స్వాగతం పలికారు. చేయూత సభ ముగిసిన తరువాత తిరుగు పయనంలో అనకాపల్లి నియోజకవర్గ ప్రజాప్రతినిధులందరినీ సీఎం ఆత్మీయంగా పలకరించారు. నియోజకవర్గంలో పార్టీ శ్రేణులందరినీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మలసాల భరత్‌కుమార్ పరిచయం చేశారు. కలెక్టర్ రవిపట్టన్ శెట్టి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ శ్రేణులు సీఎంకు వీడ్కోలు పలికారు.



సీఎంకు స్వాగతం పలుకుతున్న ఎంపీ సత్యవతి

గిరిజన మహిళకు ఉత్తమ రైతు అవార్డు



గుంటూరులో అవార్డు అందుకుంటున్న విజయమ్మ

బుచ్చెయ్యపేట : నూతన వంగడాలతో ఆధునిక పద్ధతుల్లో సాగు చేస్తూ అధిక దిగుబడులు సాధిస్తున్న ఓ గిరిజన మహిళ రాష్ట్ర స్థాయిలో ఉత్తమ మహిళా రైతుగా ఎంపికయ్యారు. కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం(కేవికే) శాస్త్రవేత్తల సూచనలతో కొత్త పంటల సాగుపై ఆసక్తి చూపుతున్న అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలం సిరసపల్లి గ్రామానికి చెందిన మరిచెట్టు విజయమ్మ మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం గుంటూరులోని ఆచార్య ఎన్జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీలో ఉత్తమ మహిళా రైతు అవార్డు అందుకున్నారు.

స్పెషల్ చీఫ్ సెక్రటరీ పూనం మాలకొండయ్య, వైస్ చాన్సలర్ శారదా జయలక్ష్మి చేతుల మీదుగా ఆమె అవార్డు స్వీకరించారు. ఈ సందర్భంగా విజయమ్మను కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.రాజ్‌కుమార్, శాస్త్రవేత్తలు ఎం.సత్తిబాబు, ఎన్.కిషోర్‌కుమార్, ఎ.సౌజన్య, పి.బాబు, తదితరులు అభినందించారు.

బైక్‌పై సీఎం అభిమాని ఎన్నికల ప్రచారం



ద్విచక్రవాహనంపై ప్రచారం చేస్తున్న రామిరెడ్డి అమరనాథ్‌రెడ్డి

అనకాపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై అభిమానంతో వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు మండలం కొత్తపేటకు చెందిన రామిరెడ్డి అమరనాథ్‌రెడ్డి తన ద్విచక్ర వాహనంపై ఎన్నికల ప్రచారం చేస్తున్నాడు. అనకాపల్లి మండలం పిసినికాడలో నాల్గో విడత వైఎస్సార్ చేయూత సభకు హాజరై కాసేపు సందడి చేశాడు. ఈయన దువ్వాడ ఫార్మాసిటీలో ఓ ప్రైవేటు కంపెనీలో 11 ఏళ్లుగా క్వాలిటీ విభాగంలో పని చేస్తూ గాజువాకలో కుటుంబంతో నివాసముంటున్నాడు. ఎన్నికలు సమీపిస్తుండటంతో రూ.40 వేల వేతనం వచ్చే ఉద్యోగాన్ని సైతం వదిలి భార్య మనోజ్ఞ, ఏడాదిన్నర పాప నివేదితలను తన అత్తారింట్లో ఉంచి రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల ప్రచారం చేయాలని నిర్ణయించుకున్నాడు. మరోసారి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించాలంటూ తన హెల్మెట్‌కు ద్విచక్ర వాహనంపై బలవంతుడికి బలహీనుడికి జరిగే యుద్ధమంటూ స్టిక్కర్లు వేయించి రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం చేస్తున్నాడు. అనకాపల్లి మీదుగా గుంటూరులో సిద్ధం సభకు బయలుదేరి వెళ్లాడు.



పంచదార్లలో ఉమా ధర్మలింగేశ్వరస్వామి

మహాశివరాత్రి వేడుకకు ముస్తాబు

- మహాశివరాత్రి వేడుకలకు ఆలయాలు ముస్తాబు



వి.బి.అగ్రహారంలో పురాతన శివలింగం



జిల్లేడుపూడిలో నాగసర్పంతో కూడిన ఎత్తయిన శివలింగం



కళ్యాణ పోతురాజుబాబు ఆలయం



పోతురాజుబాబుగా పూజలందుకుంటున్న శివలింగం

రాంబిల్లి : జిల్లాలో ప్రసిద్ధి చెందిన పంచదార్ల పుణ్యక్షేత్రం శివరాత్రి పూజలకు ముస్తాబైంది. శుక్రవారం మహా శివరాత్రి పర్వదిన సందర్భంగా ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ఈ పుణ్యక్షేత్రానికి భక్తులు తరలిరానున్నారు. తొలుత పవిత్రమైన ఆకాశధార వద్ద భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి అనంతరం క్షేత్ర పాలకుడు ఉమా ధర్మలింగేశ్వరస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేస్తారు. ఈ పుణ్యక్షేత్రంలో కాశీ విశ్వేశ్వరస్వామి, సహస్ర లింగేశ్వర స్వామి వార్ల ఆలయాలున్నాయి. మహా శివరాత్రి సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు, పూజలు ఈ పుణ్యక్షేత్రంలో నిర్వహిస్తారు. మహా శివరాత్రి రోజున ఉమా ధర్మలింగేశ్వరస్వామిని దర్శించుకొని పూజలు చేస్తే సకల శుభాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం. దిమిలిలో చారిత్రక నగ్న లింగేశ్వరస్వామి ఆలయంలోను మహా శివరాత్రి సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించనున్నారు. గోకివాడ, మురకాడ, కొత్తపట్నం, వెల్చూరు, లాలంకోడూరు తదితర గ్రామాల్లో గల శివాలయాల్లోనూ మహా శివరాత్రి పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

ప్రత్యేక పూజలు.. అభిషేకాలు..

నాతవరం : మండలంలో వి.వి.అగ్రహారంలో పురాతన శివాలయం మహాశివరాత్రి వేడుకలకు ముస్తాబైంది. ఇక్కడ 750 ఏళ్ల క్రితం కాశీ నుంచి శివలింగం తీసుకువచ్చి ప్రతిష్ఠించినట్టు ప్రతీతి. శివరాత్రి పర్వదినం సందర్భంగా దేవదాయ ధర్మదాయ శాఖ అధ్వర్యంలో అభిషేకాలు పూజలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. జిల్లేడుపూడి శ్రీనూకాలమ్మ ఆలయం ప్రాంగణంలో 30 అడుగుల ఎత్తులో నాగ సర్పంతో కూడిన శివలింగం, అలాగే సిద్దిపటన్నం శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. వెదురుపల్లి కొండపై ఏర్పాటు చేసిన శివపార్వతుల విగ్రహాలు భక్తులను ఎంతో ఆకట్టుకుంటాయి. పండగ సందర్భంగా శివపార్వతులు తలపై నీరు నిత్యం ప్రవహించే విధంగా ఏర్పాట్లు చేశారు. చిక్కుడుపాలెంలో అతి పెద్ద భూకైలాసం మహా శివలింగాలు ఏర్పాటు చేశారు. ఇక్కడ గర్భగుడిలో భక్తులు స్వహస్తాలతో శివలింగాలకు పూజ చేసుకునే అవకాశం కల్పించడం విశేషం. చమ్మచింత సరుగుడు ఎం.బి.పట్నం గ్రామాల్లో గల శివాలయాల్లో కూడా మహాశివరాత్రి పూజలకు ఏర్పాట్లు చేశారు.

కల్యాణపులోవ తిరునాళ్లకు ఏర్పాట్లు

రావికమతం : మహాశివరాత్రి పురస్కరించుకుని కళ్యాణపులోవ కళ్యాణ పోతురాజుబాబు ఆలయం వద్ద ఈ నెల 8,9,10 తేదీల్లో తిరునాళ్ల నిర్వహిస్తున్నారు.

మూడు రోజుల్లో మూడు లక్షలకు పైగా భక్తులు పాల్గొంటారని దేవదాయ ధర్మాదాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

తిరునాళ్లకు వచ్చే మహిళల కోసం స్నానాలరేవులో ప్రత్యేక దదులు ఏర్పాటు చేశారు. గజ ఈతగాళ్లు, అగ్నిమాపక సిబ్బంది, ప్రత్యేక వలంటీర్లు 100 మంది వరకూ నియమిస్తున్నారు. భక్తుల కోసం ఆలయం వద్ద షామియానాలు వేశారు. 24 కౌంటర్లలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఆధ్వర్యంలో మహా అన్నసమారాధన ఏర్పాటు చేస్తున్నారు. తాగునీరు, వైద్య బృందాలు ఏర్పాటు చేస్తున్నారు. కొత్తకోట, దొండపూడి ఫారెస్ట్ ఠాణా, కల్యాణపులోవతో పాటు దారి పొడవునా పోలీసు సిబ్బందితో రక్షణ ఏర్పాట్లు చేస్తున్నట్టు కొత్తకోట సీఐ ఎల్.అప్పలనాయుడు తెలిపారు. ట్రాఫిక్ ఇబ్బందుల దృష్ట్యా ఆర్టీసీ బస్సులు మినహా మరే ఇతర వాహనాలను అనుమతించలేదన్నారు. వీఐపీల వాహనాలకు పాస్‌లు ఇస్తున్నట్టు తెలిపారు.

65 ప్రత్యేక ఆర్టీసీ సర్వీసులు :

ఈ తిరుణాళ్లకు యాత్రికులను చేరవేసేందుకు నర్సీపట్నం డిపో నుంచి 60 ప్రత్యేక సర్వీసులు నడుస్తాయని నర్సీపట్నం డిపో మేనేజరు ధీరజ్ తెలిపారు. చోడవరం, నర్సీపట్నం, కొత్తకోట, కన్నంపేట, కొంతలం, రోలుగుంట, రావికమతం, వడ్డాది, మాడుగుల నుంచి కల్యాణపులోవకు నేరుగా సర్వీసులు నడుస్తాయన్నారు. కొత్తకోట, దొండపూడి ఠాణా, కళ్యాణపులోవలో తాత్కాలిక పాయింట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

సారా బట్టీలపై సెబ్ దాడులు



సారా సామగ్రి స్వాధీనం చేసుకున్న అసిస్టెంట్ సూపరింటెండెంట్ శైలజ, సిబ్బంది


- 4,600 బెల్లం పులుపు ధ్వంసం
- 25 లీటర్ల సారా స్వాధీనం

నర్సీపట్నం : జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ, సెబ్ జాయింట్ డైరెక్టర్ బి.విజయభాస్కర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ జయసింహ చౌదరి ఆదేశాల మేరకు నాతవరం, గొలుగొండ మండలాల్లో సారా తయారీ బట్టీలపై దాడులు నిర్వహించామని ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ డి.శైలజ తెలిపారు. సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 4,600 బెల్లం పులుపు ధ్వంసం చేశారు. 25 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఇన్‌స్పెక్టర్ షేక్ మీరా సాహెబ్, సీఐ కె.సునీల్, ఎస్‌ఐలు షేక్ రహీం, తుని సెబ్ ఎస్‌ఐలు పి.చిట్టిబాబు, బి.శంకరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

1200 లీటర్ల పులుపు ధ్వంసం

నాతవరం: గుట్టు చప్పుడు కాకుండా సారా తయారీ చేస్తున్న సారా బట్టీలపై దాడి చేసి 1200 లీటర్లు పులుపును ధ్వంసం చేశామని గొలుగొండ ఎస్‌ఈబీ ఎస్‌ఐ షేక్, రహీమ్ తెలిపారు. జిల్లేడుపూడి శివారు తోటల్లో సారా తయారీ చేస్తున్నట్టు వచ్చిన సమాచారంతో దాడి జరిపినట్టు తెలిపారు. అయితే సారా నిర్వాహకులు పరారయ్యారని తెలిపారు.

కల్వర్టు మదుంను ఢీకొని వ్యక్తి మృతి



గణేష్ మృతదేహం

రాంబిల్లి : రాంబిల్లి ప్రధాన రహదారిని ఆనుకొని ఉన్న కల్వర్టును ఢీకొని కృష్ణంపాలేనికి చెందిన కె. గణేష్(37) మృతి చెందాడు. ఇతను సెజ్‌లో గల ఒక కంపెనీలో కళాసీగా పనిచేస్తున్నాడు. బుధవారం రాత్రి విధులు పూర్తి చేసుకొని బైక్‌పై ఇంటికి వస్తుండగా అప్పారాయుడు పాలెం రోడ్డు జంక్షన్ సమీపంలో గల కల్వర్టు మదుంను ఢీకొని మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. బహిర్భూమికి వెళ్లిన వ్యక్తులు గమనించి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చినట్టు పోలీసులు పేర్కొన్నారు. గణేష్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ లక్ష్మణరావు తెలిపారు.

మహా శివరాత్రికి 74 ప్రత్యేక బస్సులు

అనకాపల్లి: మహా శివరాత్రి పురస్కరించుకుని జిల్లాలో నర్సీపట్నం, అనకాపల్లి డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి కె.పద్మావతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం నుంచి నర్సీపట్నం డిపో నుంచి నాలుగు ప్రత్యేక బస్సులు బయల్దేరుతాయన్నారు. 8, 9 తేదీల్లో అదే డిపో నుంచి కల్యాణపులోవకు 25 బస్సులు, ధారమట్టం ప్రాంతానికి 15 బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. అనకాపల్లి డిపో నుంచి కల్యాణపులోవకు 20 బస్సులు, పుణ్యగిరి క్షేత్రానికి 10 బస్సులు ప్రవేశ పెట్టామన్నారు.

బతుకు బండి తోలుతూ... కుప్పకూలాడు

అనకాపల్లి: గుండెపోటుతో లారీ డ్రైవర్ మృతి చెందినట్టు పట్టణ పోలీసులకు గురువారం ఫిర్యాదు అందింది. ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట జిల్లా ఆత్మకూరుకు చెందిన కోడూరు యల్లయ్య(45) తెలంగాణ నుంచి చోడవరంకు లోడు తీసుకొచ్చి అక్కడ దించిన తర్వాత చోడవరం నుంచి విశాఖపోర్ట్‌కు వెళ్తున్న సమయంలో స్థానిక విజయరామరాజుపేట అండర్‌బ్రిడ్జి వద్ద గుండెపోటు రావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మరో లారీ డ్రైవర్ మజ్జి నర్సింహమూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్టు ఎస్‌ఐ చెప్పారు.

120 కిలోమీటర్లు ప్రయాణించి..



కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న చినతల్లికి పింఛను నగదు ఇస్తున్న సచివాలయ ఉద్యోగి గౌస్

కోటవురట్ల: సేవా గుణాన్ని ప్రదర్శించడంలో వలంటీర్లతో సచివాలయ ఉద్యోగులు పోటీ పడుతున్నారు. పింఛనుదారులు అందుబాటులో లేకపోతే వలంటీర్లు సుదూరం ప్రయాణించి పింఛను నగదు అందించేవారు. తాజాగా వలంటీరుకు కుదరకపోవడంతో ఓ సచివాలయ ఉద్యోగి తన ధర్మాన్ని నిర్వర్తించారు. తంగేడు గ్రామానికి చెందిన సుర్ల చినతల్లి కొద్దిరోజులుగా అనారోగ్యంతో విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతోంది. వలంటీరు అందుబాటులో లేకపోవడంతో సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ గౌస్ బాధ్యతను తీసుకుని 120 కిలోమీటర్లు ప్రయాణించి కేజీహెచ్‌లో ఉన్న చినతల్లికి రూ.3 వేలు పింఛను నగదును అందజేశారు. విషయం తెలుసుకున్న వైస్ ఎంపీపీ ఆర్‌ఎస్ సీతారామరాజు, సర్పంచు కొరుప్రోలు శివకుమార్, కార్యదర్శి సంతోషి, సచివాలయ సిబ్బంది గౌస్‌ను అభినందించారు. సీతారామరాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఓ గొప్ప ఆశయంతో సచివాలయ వ్యవస్థను తీసుకురాగా అందులో పనిచేస్తున్న ఉద్యోగులు, వలంటీర్లు సేవా భావాన్ని చాటడంలో ముందుంటున్నారని కితాబునిచ్చారు.

కొవ్వూరులో 20 ఎకరాల్లో జీడితోట దగ్ధం

- సుమారు రూ.8 లక్షల పంట నష్టం
- నష్టపోయి రోడున పడ్డ ఆరు కుటుంబాలు



కాలిపోయిన జీడితోట వద్ద బాధిత కుటుంబాలు

రోలుగుంట : మండలంలోని కొవ్వూరు గ్రామంలో బుధవారం అర్ధరాత్రి దాటాక జీడితోటలు దగ్ధమై 20 ఎకరాల్లో పంట నష్టం సంభవించింది. ఈ ఘటనలో గ్రామానికి చెందిన ఆరు కుటుంబాలవారు తీవ్రంగా నష్టపోయారు. పంట నష్టం సుమారు రూ. 8 లక్షలుంటుందని బాధితులు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఈ పాకల వద్ద రైతులు తోట పనులు ముగించుకుని బుధవారం రాత్రి ఇళ్లకు చేరుకున్నారు. అర్ధరాత్రి దాటిన తరువాత యర్రంశెట్టి వారి పాకల వైపు నుంచి వేడిగాలులతో కూడిన సెగలు రావడంతో రైతులు జీడి తోటల వద్దకు పరుగు తీశారు. అప్పటికే జీడితోటల ప్రాంతమంతా దగ్ధమైంది. ప్రమాదం ఎలా జరిగిందో తెలియరాలేదు. జరిగిన నష్టంపై ప్రభుత్వ పరిహారం కోసం అధికారులకు నివేదించనున్నట్టు బాధితులు యర్రశెట్టి అప్పలనాయుడు, రాజు, ప్రకాష్ , పెద్దిరాయుడు, రామారావు, కోలిపెల్లి ఈశ్వర్రావు విలేకరులకు తెలిపారు.

మహా శివరాత్రికి పటిష్ట భద్రత

- ఎస్పీ మురళీకృష్ణ

అనకాపల్లి: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో దేవాలయాల వద్ద, శైవక్షేత్రాల వద్ద, స్నాన ఘట్టాలు, సముద్ర స్నానాల వద్ద పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ కేవీ మురళీకృష్ణ తెలిపారు. శివాలయాలకు విచ్చేసే భక్తులకు ఎటువంటి అసౌకర్యం, ట్రాఫిక్ సమస్యలు కలగకుండా తగినంత సిబ్బందిని నియమించామన్నారు. దేవదాయ, రెవెన్యూ, మత్స్య, ఇతర శాఖల సమన్వయంతో ఎక్కడ ఎలాంటి అవాంఛనీయమైన సంఘటనలు చోటుచేసుకుండా ప్రశాంత వాతావరణంలో ఉత్సవం జరిగేలా చూడాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు. దొంగతనాలు జరగకుండా ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. మహిళలు, చిన్నపిల్లలు స్నాన ఘట్టాల వద్ద అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోలీసుల సూచనలు పాటిస్తూ జాగ్రత్త వహించాలన్నారు. అత్యవసర సమయంలో స్థానిక పోలీసులకుగాను, 112/100 నంబర్లకు గాని ఫోన్ చేసి తెలియజేయాలన్నారు.

క్లుప్తంగా

ఆకట్టుకున్న ప్రవచనాలు



ప్రభూజీని సత్కరిస్తున్న పాలకవర్గ సభ్యులు

అనకాపల్లి: గౌరీపంచాయతన దేవస్థానం ఆధ్వర్యంలో స్థానిక కొణతాల సుబ్రహ్మణ్యం హాలులో బుధవారం రాత్రి ఆధ్యాత్మిక వేత్త, రచయిత భక్తి వేదాంత విద్యాపీఠం గౌరంగధర్మన్ ప్రభూజీ శ్రీకృష్ణ కథామృతం ప్రవచనాలు భక్తులు ఎంతగానో ఆకట్టుకున్నాయి. అంతకుముందు పంచాయతన పాలకవర్గ సభ్యులు ఆయన్ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గౌరీ పంచాయతీ దేవస్థానం అధ్యక్షుడు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామ సత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్ పాల్గొన్నారు.

అసమానతలు లేని సమాజం కోసం పోరాటం



మాట్లాడుతున్న రూపాదేవి

అనకాపల్లి: ప్రపంచంలో మహిళలను ద్వితీయ శ్రేణి పౌరులుగా నేటికీ చూస్తున్నారని శ్రామిక మహిళా సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ సీహెచ్.రూపాదేవి అన్నారు. గురువారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆమె మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా మహిళల హక్కుల కోసం సమానత్వం కోసం పోరాడి సాధించుకున్న దినంగా మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. ప్రపంచీకరణ నేపథ్యంలో మహిళను వ్యాపార సరకుగా చూస్తున్నారని, అశ్లీల సాహిత్యం, వ్యాపార ప్రకటనలతో మరింత లైంగిక వేధింపులు పెరిగాయని, పని ప్రదేశంలో ఇబ్బందులు పడుతున్నారని, కనీస వేతనాలు అమలు కావడం లేదని వాపోయారు. ఈ నేపథ్యంలో మహిళలందరూ ఐక్యంగా కలిసి అసమానతలు లేని సమాజం కోసం పోరాడాలని ఈ నెల 15వ తేదీ వరకు మహిళా దినోత్సవం కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు శ్రీలక్ష్మి, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ నాయకులు తనూజ, కాసులమ్మ, పి.మాణిక్యం, డి.డి.వరలక్ష్మి పాల్గొన్నారు.

చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడిగా సూర్యారావు



ట్రస్టు నూతన కార్యవర్గం

అనకాపల్లి: జీవీఎంసీ విలీన గ్రామమైన కేఎన్ఆర్ పేట శ్రీరామ వేంకటేశ్వర చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడిగా కాండ్రేగుల సూర్యారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం స్థానిక దేవాలయం ఆవరణలో ఎన్నిక నిర్వహించారు. ట్రస్టు చైర్మన్‌గా తాడి రామకృష్ణ, ముఖ్య పోషకులుగా శ్రీరామదాజు గోవిందరావు, కార్యదర్శిగా గంగుపాము తాతారావు, కోశాధికారిగా చూచుకొండ రమణ, సలహాదారులుగా దొడ్డి వెంకటరావు, గుంగుపాం నాగేశ్వరరావుతోపాటు మరో పది మంది సభ్యులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సూర్యారావు మాట్లాడుతూ పై కమిటీ రెండేళ్లపాటు పనిచేస్తుందన్నారు.

మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ

అనకాపల్లి: స్థానిక స్టేట్ బ్యాంకు గ్రామీణ ఉపాధి శిక్షణ సంస్థ కార్యాలయంలో టైలరింగ్ శిక్షణ పూర్తి చేసుకున్న ఎనిమిది మంది మహిళలకు రీజనల్ మేనేజర్ కె.జగదీశ్వరరావు గురువారం కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుట్టు శిక్షణతో మహిళలు స్వశక్తితో ఆర్థికంగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ బి.విజయకుమార్, సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు గురువారం 5,900 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,700	4,350
మొదటి రకం	3,540	4,290
రెండో రకం	3,410	3,790
మూడోరకం	3,270	3,500

ఉప్పొంగిన అభిమానం..

అభిమానం ఉప్పొంగింది.. ఉత్సాహం ఉరకలేసింది. తమ అభిమాన నేత సీఎం జగన్‌ను కనులారా చూసేందుకు ఊరూవాడా కదలి వచ్చింది. తొలుత హెలిప్యాడ్ వద్ద ఘన స్వాగతం పలికి పిసినికాడ సభా స్థలికి వాహనాల్లో పెద్ద ఎత్తున ర్యాలీగా చేరుకుంది. దాంతో అక్కడ సభ ప్రాంగణం కిక్కిరిసింది. కడదాకా సీఎం ప్రసంగాన్ని వీక్షించి జేజేలు పలికింది.

- సీఎం బహిరంగ సభకు పెద్ద ఎత్తున ప్రజానీకం
- కశింకోట హెలిప్యాడ్ నుంచి సభా స్థలి వరకు ఘన స్వాగతం
- జనసంద్రమైన సభా స్థలి



సీఎం జగన్‌కు జ్ఞాపిక అందజేస్తున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు, మంత్రి అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి, ప్రభుత్వ విప్ ధర్మశ్రీ, సమన్వయకర్త భరత్‌కుమార్



సీఎంకు స్వాగతం పలుకుతున్న వైఎస్సార్‌సీపీ అనకాపల్లి సమన్వయకర్త మలసాల భరత్



ఊడేరు గ్రామం నుంచి సభాస్థలికి ర్యాలీగా బయలు దేరుతున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



కశింకోట వద్ద హెలికాప్టర్ నుంచి బయలుదేరిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



బవులవాడ నుంచి ఆటోల్లో వెళ్తున్న మహిళలు

అనకాపల్లి/తుమ్మపాల: పట్టణంతోపాటు మండలంలోని ప్రజలు ప్రత్యేక బస్సులు, ఆటోలు, బైక్‌లు, తదితర వాహనాల్లో సీఎం సభా స్థలికి తరలివెళ్లారు. తమ అభిమాన నాయకుడ్ని చూసేందుకు అభిమానులతోపాటు వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్ద ఎత్తున ర్యాలీగా చేరుకున్నారు. నాల్గో విడత వైఎస్సార్ చేయూత అందుకునేందుకు నలుదిక్కుల నుంచి 50 వేల మందికిపైగా అక్కచెల్లెమ్మలతో సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. నియోజకవర్గంలో కశింకోట మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ నుంచి సభా స్థలికి వస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి దారి పొడవునా ఘన స్వాగతం లభించింది. రెండు లక్షల మందికి పైగా హాజరైన జనంతో గ్యాలరీ నిండిపోవడంతో ఆ పక్కనే మరికొంత మందికి కుర్చీలు ఏర్పాటు చేయాల్సి వచ్చింది. సీఎం ప్రసంగాన్నీ వీక్షించేందుకు ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. బాబు దత్త పుత్రుడు పవన్ కల్యాణ్‌లపై చేసిన విమర్శలకు పార్టీ కేడర్ నుంచి విశేష స్పందన లభించింది. టీడీపీ-జనసేన పార్టీలను విమర్శిస్తూ చేసిన ప్రసంగానికి ప్రజల నుంచి హర్షధ్వానాలు వినిపించాయి. అక్కడే ఉన్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు జై జగన్... జై జై జగన్.. అంటూ నినదించారు. ఈ కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, రాష్ట్ర వైద్య విభాగం ప్రధాన కార్యదర్శి బొడ్డేడ లక్ష్మీనర్సింహారావు, ఎంపీపీ గొర్లి సూరిబాబు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు పెతకంశెట్టి శివసత్యనారాయణ, మహిళా విభాగం అధ్యక్షురాలు ఏవీ రత్నకుమారి, కార్పొరేటర్లు మందపాటి సునీత, జాజుల ప్రసన్నలక్ష్మి, పీలా లక్ష్మీసౌజన్య, కొణతాల నీలిమ, మలసాల ధనమ్మ, మలసాల రమణరావు, ఉగ్గిన అప్పారావు పాల్గొన్నారు.

కశింకోట నుంచి....

సీఎం బహిరంగ సభకు కశింకోట మండల ప్రజలు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. కశింకోటతోపాటు ఏఎస్ పేట, తాళ్లపాలెం, బయ్యవరం, కన్నూరుపాలెం, నరసింగబిల్లి తదితర మండల గ్రామాల నుంచి ఎక్కువ సంఖ్యలో ఆటోలు, కార్లలో తరలి వెళ్లారు. ఎంపీపీ కలగా లక్ష్మి, జెడ్పీటీసీ దంతులూరి శ్రీధర్‌రాజు, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, పార్టీ మండలాధ్యక్షుడు మలసాల కిశోర్, పార్టీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు తదితరుల ఆధ్వర్యంలో వెళ్లారు.

సీఎం హెలిప్యాడ్ వద్ద...

కశింకోట మండల పరిషత్ కార్యాలయం వద్ద ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్థానిక ప్రజాప్రతిధులు, స్థానికుల నుంచి వినతులు స్వీకరించారు. పిసినికాడ సభ అనంతరం ఇక్కడ ఏర్పాటు చేసిన శిబిరంలో పలువురి నుంచి వినతులు స్వీకరించి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ రవి పట్టన్‌శెట్టిని ఆదేశించారు. స్థానిక హౌసింగ్ కాలనీకి చెందిన పావాడ బాలాజీ తలసేమియా సమస్యపై విన్నవించగా, అందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్‌ను ఆదేశించారు. కార్యక్రమం అనంతరం హెలికాప్టర్‌లో ముఖ్యమంత్రి తరలి వెళ్లారు. హెలిప్యాడ్ చుట్టూ బారికేడ్ల వెంబడి బారులు తీరిన ప్రజలు ముఖ్యమంత్రి వెళ్లే వరకు ఆసక్తిగా నిరీక్షించారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖమంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ బీశెట్టి వెంకటసత్యవతి, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, వాటర్ వేస్ అథారిటీ సంస్థ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ తదితరులు వీడ్కోలు పలికారు. వైఎస్సార్ సీపీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, పార్టీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్ పాల్గొన్నారు.

పోలీసు సేవలు భేష్

సాక్షి, అనకాపల్లి: వైఎస్సార్ చేయూత సభకు వచ్చిన ప్రజలకు, ప్రజాప్రతినిధులకు ఎటువంటి అవాంతరాలు లేకుండా జిల్లా ఎస్పీ మురళీకృష్ణ చర్యలు తీసుకున్నారు. ఇంటర్ విద్యార్థులకు ఎటువంటి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తీసుకున్న ముందస్తు జాగ్రత్తలు సత్ఫలితాలనిచ్చాయి. ఒకరోజు ముందుగానే ఆంక్షలు విధించి, ట్రాఫిక్ మళ్లించారు. 1500 మంది పోలీసులు, సిబ్బందితో పటిష్టమైన భద్రత కల్పించారు.



సిద్ధం, ఫ్యాన్ సింబల్‌తో వైఎస్సార్‌సీపీ శ్రేణులు



వెంకుపాలెం గ్రామం నుంచి..



సీహెచ్.ఎన్.అగ్రహారం నుంచి సీఎం సభకు తరలివెళ్తున్న పార్టీ శ్రేణులు



వైఎస్సార్ చేయూత బోర్డు, ఫ్యాన్ సింబల్‌తో పార్టీ అభిమాని



కశింకోట: సీఎం ప్రసంగాన్ని ఎల్‌ఈడీ టీవీలో ఆసక్తిగా వీక్షిస్తున్న మహిళలు



అక్కిరెడ్డిపాలెం నుంచి సభకు వెళ్తున్న మహిళలు



సీఎంను కలిసేందుకు ఎదురుచూస్తున్న నాయకులు



కోడూరు నుంచి ఆటోల్లో వెళ్తున్న మహిళలు



మామిడిపాలెం నుంచి..



ముఖ్యమంత్రికి స్వాగతం చెప్పేందుకు బారులు తీరిన మహిళలు



శంకరం నుంచి తరలివెళ్తున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు

జగనన్న పాలనకు జేజేలు..

కశింకోట: అనకాపల్లి మండలం పిసినికాడ బహిరంగ సభకు పెద్ద ఎత్తున మహిళలు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగాన్ని చివరి వరకు వీక్షించి తమ ఆనందాన్ని పంచుకున్నారు. వైఎస్సార్‌సీపీ పాలనపై ప్రశంసలతో ముంచెత్తిన అభిప్రాయాలు వారి మాటల్లోనే..

మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అద్భుతమైన పాలన అందిస్తున్నారు. మా పిల్లలకు అమ్మఒడి వస్తోంది. దీంతో బాగా చదివించుకుంటున్నాం. మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి కావాలి.

– భీశెట్టి వరలక్ష్మి, సీతానగరం, అనకాపల్లి మండలం

జగనన్నకు రుణపడి ఉంటాం



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత నా కుమారుడు సత్యనారాయణకు విద్యుత్ శాఖలో లైన్‌మన్‌గా నాలుగేళ్ల క్రితం ఉద్యోగం వచ్చింది. మా కుటుంబ ఆర్థిక పరిస్థితి మెరుగుపడింది. నా భర్త పేరిట రైతు భరోసా వస్తోంది. ముఖ్యమంత్రికి సదా రుణపడి ఉంటాం.

–యల్ల నారాయణమ్మ, దాసరయ్యపాలెం, రావికమతం మండలం

కుటుంబానికి 'చేయూత'



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత నా కుటుంబానికి రెండు సంక్షేమ పథకాలు అందుతున్నాయి. భర్తకు వృద్ధాప్య పింఛన్ వస్తోంది. నాకు వైఎస్సార్ చేయూత సాయం ఏటా అందుతోంది. దీంతో ఇది కుటుంబానికి చేయూతగా నిలుస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

–ఒబిలిశెట్టి వరలక్ష్మి, తీగాడ, కశింకోట మండలం

ఇంటి స్థలం వచ్చింది



వైఎస్సార్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంటి స్థలం మంజూరు చేశారు. అమ్మఒడి వస్తోంది. దీంతో మా పిల్లలను చదివించుకోవడానికి ప్రోత్సాహకంగా ఉంది. మాకు ఎంతో సంతోషంగా ఉంది.

–శ్రావణి, పిసినికాడ, అనకాపల్లి మండలం.

సీఎం పాలన బాగుంది



అన్ని వర్గాలను సమ ప్రాధాన్యం అందిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారు. ఇందుకు ఎంతో ఆనందంగా ఉంది.

– మల్లికా భాను, అనకాపల్లి

శివ పూజకు వేళాయె..



గవరపాలెం భోగలింగేశ్వర స్వామి ఆలయం సమీపంలో ఈశ్వరుడు



కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన టెంట్



విద్యుత్‌దీపాలంకరణ ధగధగలాడుతున్న పార్వతి సమేత ఉమామహేశ్వరస్వామి ఆలయం

- శివాలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు

అనకాపల్లి: క్షీరసాగర మథనంలో లోకాన్ని దహించే హాలాహలాన్ని పరమశివుడు గరళమందు నిలిపి ముల్లోకాలను కాపాడిందీ కూడా ఇదే శివరాత్రి రోజున అని పురాణ ప్రతీతి. శివ అంటే శుభం, ఆనందం, కైవల్యం అని అర్థాలున్నాయి. శివరాత్రి వేళ అభిషేక ప్రియుడైన శివుడి లింగాన్ని మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, నమక-చమకాలు, పురుష సూక్తం ఇలా ఏదొక తీరున పూజిస్తే శివుడి అనుగ్రహం లభిస్తుందని భక్తుల విశ్వాసం. అంతటి మహిమాన్విత మహా శివరాత్రి వేడుకలకు పట్టణంలో శివాలయాలు ముస్తాబయ్యాయి. వేల్పులవీధి కాశీవిశ్వేశ్వరస్వామి, గవరపాలెం భోగలింగేశ్వరస్వామి, సిద్ధిలింగేశ్వరస్వామి, సాధువుల ఆలయం, చిన్నవీధి, చౌడేశ్వరి సాంబమూర్తి ఆలయం, ఉమారామలింగేశ్వర ఆలయాలను విద్యుత్‌దీపాలతో సుందరంగా అలంకరించారు. గ్రేటర్ విశాఖ కొత్తూరు నర్సింగరావుపేట కొండమీద పార్వతి సమేత ఉమామహేశ్వరుడికి తెల్లవారుజామున నుంచి అభిషేకాలు, పూజలు జరగనున్నాయి.

కశింకోట: మండలంలో పలు ఆలయాలు, శివాలయాలు మహా శివరాత్రి వేడుకలకు ముస్తాబయ్యాయి. స్థానిక పురాతన త్రిపురాంతకస్వామి ఆలయంలో వేకువజాము నుంచి రాత్రి వరకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించనున్నట్లు అర్చకుడు వి. చిదంబరం తెలిపారు. కస్పావీధిలోని సాంబశివుని ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించనున్నట్లు అర్చకుడు వెయ్యిదళముల ప్రసాద్ తెలిపారు. తీగాడలోని శారదానది తీరంలో శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు హిట్లర్ తెలిపారు.

ఏఎస్ పేటలో గిరి ప్రదక్షిణ:

అమీన్‌సాహెబ్‌పేటలో వెలసిన సాంబశివుని ఆలయంలో మొదటిసారిగా గిరి ప్రదక్షిణ ఏర్పాటు చేశారు.

అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు

తుమ్మపాల: ప్రస్తుత రోజుల్లో మహిళలు మహా శక్తులుగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ హెడ్ నరేష్ తెలిపారు. వీరికి అవసరమైన రుణాలను మంజూరు చేసేందుకు బ్యాంకులు సిద్ధంగా ఉన్నాయన్నారు. సమితి కార్యదర్శి కర్రి జోగినాయుడు ఆధ్వర్యంలో గురువారం స్థానిక శారదా వేలి డెవలప్‌మెంట్ ప్రాంగణంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా నరేష్ విచ్చేసి మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకున్నప్పుడే కుటుంబంలో మెరుగైన ఫలితాలు సాధ్యపడతాయన్నారు. మరో అతిథి, సోషల్ వర్కర్ లావణ్య మాట్లాడుతూ పొదుపు చేసుకోవడం ద్వారా మహిళలు ఆర్థికంగా స్థిరపడవచ్చన్నారు. జే ఫార్మ్ సంస్థ ప్రతినిధి ఆంజనేయులు మాట్లాడుతూ వ్యవసాయం పనిముట్లను సబ్సిడీ రూపంలో అందిస్తామన్నారు. లుపిన్ కంపెనీ మేనేజర్ వెంకట్ మాట్లాడుతూ మహిళలకు నైపుణ్యంతో కూడిన శిక్షణతోపాటు వ్యాపార ప్రోత్సాహం ఇస్తామన్నారు. దిశ పోలీస్ స్టేషన్ ఎస్సై రాములమ్మ మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. రైతు ఉత్పత్తి సంఘాలు ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు.



వేడుకలో పాల్గొన్న ప్రముఖులు